ప్రజాశక్తి
గురువారం 28 సెప్టెంబర్ 2023

కంపించిన భూమి

ప్రజాశక్తి-బొబ్బిలి, సాలూరు
బొబ్బిలి, సాలూరు, రామభద్రపురం, మక్కువ మండలాల పరిధిలో బుధవారం మధ్యాహ్నం భూమి కంపించింది. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో భూమి మధ్యాహ్నం 2.15గంటల సమయంలో రెండు సెకన్లు పాటు కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంటిలో సామగ్రి కదిలి శబ్దం రావడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు బయటకు పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్ పై 4.5గా భూమి కంపించినట్లు అధికారులు చెపుతున్నారు. సాలూరులోను భూమి కంపించడంతో ఇళ్ళల్లో వున్న జనం రోడ్లపైకి పరుగులు తీశారు. సమీపంలో వున్న రామభద్రపరం, బొబ్బిలిలో కూడా భూమి కంపించింది.

అంగన్వాడీల ఆందోళన

సాలూరురూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్
అంగన్వాడీల అరెస్టును, పోలీసుల నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఐసిడిఎస్ సాలూరు రూరల్ కార్యాలయం వద్ద బుధవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు నారణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామన్న హామీని మరిచిపోయిందన్నారు. ఉద్యోగ భద్రత ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారని గుర్తుచేశారు. సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా, రాష్ట్రంలో అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేయడానికి విజయవాడ వెళ్లిన వారిని నిర్బంధించడం దారుణమన్నారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. సెక్టార్ నాయకులు పార్వతి, పోలమ్మ, సుజాత, శాంత, జానకి, సీనియర్ నాయకులు కమలమ్మ, బోడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడారు. అనంతరం సూపర్వైజర్ అరుణ, శారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సిరికి అనురాధ, జయమ్మ, అనురాధ, మంగమ్మ, జ్యోతి, పార్వతి పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : అంగన్వాడీల అరెస్టులను ఖండిస్తూ పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా నాయకులు వి.ఇందిర ఆధ్వర్యంలో అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కన్నా వేతనాలు ఎక్కువ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటి అమలు చేయాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.గౌరి, గౌరిమణి, రాజేశ్వరి, రాధిక, దేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్.. మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం
పెంచిన విద్యుత్తు ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని వామపక్షాల ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తొలుత సిపిఎం కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు మాట్లాడుతూ ప్రజల కళ్లు కప్పి దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీల పేరుతో సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్తు ఛార్జీల పెంపు, విద్యుత్తు సంస్కరణ బిల్లును రద్దు చేయాలని శాంతియుతంగా పోరాటాలు చేస్తున్న ప్రజా సంఘాలు, పార్టీల నాయకులపై పోలీసులు తీవ్ర నిర్బంధం విధిస్తున్నారని మండిపడ్డారు. సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టరాదని, ప్రజలపై భారాలు వేయవద్దని కోరారు. విద్యుత్తు సంస్కరణల బిల్లులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కోతలు అరికట్టాలన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, ఎస్‌సి, ఎస్‌టి, వృత్తిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్లలోపు వినియోగించే పేదలందరికీ ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఓ వెంకట రావుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకట రమణ, ఎస్.ఉమ, బంకురు సూరిబాబు, ఇందిర, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంఘం, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు పి.శ్రీనునాయుడు, భాస్కరరావు, సిపిఐ జిల్లా నాయకులు టి.జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో వినతుల పరిష్కారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం
జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, చిత్తశుద్ధితో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. గరుగుబిల్లి ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి ప్రత్యేక జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం జిల్లా అధికారులతో కలిసి నిర్వహించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలత వినతులను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 78 వినతులు అందాయి. భూ సమస్యలు పరిష్కరించాలని, సామాజిక పింఛన్లు పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు అందించేందుకు జిల్లా కేంద్రానికి అర్జీదారులు రావాల్సిన పరిస్థితి తలెత్తకుండా మండల స్థాయిలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వినతుల్లో కొన్ని...

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్

ఎంపిడిఒ కార్యాలయం శిథిలావస్థలో ఉందని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని, సీతాపురం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఉద్యానవన విశ్వవిద్యాలయం వరకు బిటి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని, నూతన రహదారులు మంజూరు చేయాలని ఎంపిపి ఉరిటి రామారావు కోరారు.

సన్యాసిరాజుపేట గ్రామం వద్ద జంఝావతి కాలువ మీద కల్వర్టు నిర్మాణం చేపట్టి పంట పొలాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన అప్పలస్వామి నాయుడు వినతి పత్రం సమర్పించారు.

సుంకి గ్రామ నిర్వాసితులకు పునరావాసం కింద టిఆర్‌ఎస్ వలసలో కేటాయించిన కాలనీని సుంకి గ్రామంలోనే మంజూరు చేయాలని వాకాడ కురిమినాయుడు దరఖాస్తు అందించారు.

ఎక్కింవలస, గరుగుబిల్లి భూముల మీదుగా ప్రధాన రహదారి నుంచి మల్లేడు చెరువు వరకు కాలువ పనులు చేపట్టి, అర్ధాంతరంగా నిలిపేశారని, తోటపల్లి, జంఝావతి కాలువల నీరు అందక రైతులు నష్టపోతున్నారని, పొలాలకు సాగునీరు ఇప్పించే దిశగా చర్యలు చేపట్టాలని పిచ్చివలస గ్రామ సర్పంచి బి.నారాయణమ్మ వినతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి సన్యాసినాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, తహశీల్దార్ జి.వి.జనార్దన్, ఎంపిడిఒ జి.పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు భోజన కష్టాలు

మెనూ రేటు పెంచినా నాణ్యత అంతంత మాత్రమే • ఏరియా ఆస్పత్రిలో తక్కువ రకం బియ్యం వినియోగం

ప్రజాశక్తి-సాలూరు
పట్టణంలోని పెద్దాస్పత్రిలో పేద రోగులకు భోజన కష్టాలు తప్పడం లేదు. వందపడకల ఆస్పత్రి అయిన తర్వాత రోగుల తాకిడి పెరిగింది. సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రాంతీయ ఆస్పత్రి స్థాయికి చేరడంతో నిపుణులైన వైద్యులు ఇక్కడ నియామకమయ్యారు. సేవలు బాగుండటంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా పెరుగుతోంది. ఆస్పత్రిలో పడకల సంఖ్య పెంచినా వసతి సమస్యగా ఉండడంతో ఒకే మంచంపై ఇద్దరు రోగులను ఉంచాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఆస్పత్రిలో వైద్యం కోసం చేరిన రోగులు, వారి వద్ద ఉండే సహాయకులకు భోజనం సరఫరా అవుతోంది. గతంలో ఒక్కో రోగికి భోజనం నిమిత్తం ప్రభుత్వం రోజుకు 40 రూపాయల చొప్పున మంజూరు చేసింది. ఇప్పుడు దానిని 72 రూపాయలకు పెంచింది. ఇప్పుడున్న నిత్యావసర సరుకుల ధరల ప్రకారం చూస్తే పెంచిన మెనూ రేటు కూడా తక్కువే అవుతుంది. మెనూ రేటు పెంచినా రోగులకు అందుతున్న ఆహారం నాణ్యతలో పెద్దగా తేడా కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భోజనంలో ప్రధానమైన అన్నం కోటా బియ్యంతో వండుతున్నట్టు కనిపిస్తోంది. సాధారణంగా ఆస్పత్రిలో ఉండే రోగులకు ఎంత నాణ్యమైన భోజనం పెడితే వారు అంత ఇష్టంగా తింటారు. కానీ మెనూ రేటు పెరిగినా కాంట్రాక్టరు నాణ్యతతో కూడిన భోజనం పంపిణీ చేయడం లేదని తెలుస్తోంది. భోజనంలో అరటి పండు చాలా చిన్నవి సరఫరా చేస్తున్నారు. దీంతో రోగులు గత్యంతరం లేని పరిస్థితుల్లో నాణ్యత లేని భోజనమైనా తింటున్నారు. ఇక్కడ ఇన్ పేషెంట్లుగా చేరిన వారిలో గిరిజనులు ఎక్కువ మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భోజనానికి సంబంధించి గత ఆరేడు నెలలుగా బిల్లులు మంజూరు చేయలేదన్న సాకుతో కాంట్రాక్టరు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా రోగులకు నాణ్యతతో కూడిన భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత స్థానిక ఆస్పత్రి వైద్యాధికారిపై ఉంటుందని పలువురు భావిస్తున్నారు.


రోగులకు పెట్టే అరటిపండ్లు ఇవే ; నాణ్యతలేని ఆహారంతో రోగి బంధువు

విద్యారంగ సమస్యలపై
2 నుంచి ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-పార్వతీపురం
విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సైకిల్‌యాత్ర చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో యాత్రకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 2న పాచిపెంట మండల కేంద్రంలో ప్రారంభించి, 11న పార్వతీపురంలో ముగిస్తుందని తెలిపారు. 15 మండలాల పరిధిలో సుమారు 400 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందన్నారు. సంక్షేమ హాస్టలకు బకాయిలుగా నిలిచిన మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఇపి, 117 జిఒ రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, తదితర డిమాండ్లపై చేపట్టే సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, కె.గంగారాం, ఉపాధ్యక్షులు కె.భాస్కర్, చందు పాల్గొన్నారు.

కురుపాంలో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం
కురుపాం నియోజకవర్గ కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి మన్యం తడిసిముద్దయింది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఇప్పటివరకు వాతావరణం సరిగ్గా లేక నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నాట్లు ఆలస్యంగా పడ్డాయి. సరైన వర్షాలు లేక పొలాలు ఎండుతున్న తరుణంలో ప్రస్తుతం కురిసిన వర్షంతో వరిచేలుకు కొంతవరకు మేలు చేకూరనుంది.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పార్వతీపురం
చట్టాలపై అవగాహన అవసరమని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకరరావు అన్నారు. బుధవారం పార్వతీపురం ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో సిఐడి పౌర హక్కుల రక్షణ విభాగం ఆధ్వర్యంలో ఎస్‌టి, ఎస్‌సి సాధికారిత, అత్యాచారాల నియంత్రణ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పొందాలన్నారు. కొన్ని సందర్భాల్లో బలహీనులు బాధితులుగా మారతారని, వాటికి వ్యవస్థలు సహకరించి న్యాయం చేయాలని అన్నారు. చట్టం అంటే శిక్షించేది కాదని, బాధ్యతలను తెలియజేసేది, రక్షణగా నిలిచేది అని ఆయన వివరించారు. వాటిపై సమగ్ర అవగాహన అవసరమని, ఇందుకు విద్య దోహదం చేస్తుందని చెప్పారు. విద్యతో వివేకం పెరిగి సామాజిక జ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తుందని, పథకాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాధితులకు అండగా ఎస్‌టి కమిషన్ ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చట్టాలు, నియమాలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న వారికి క్విజ్‌ను నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన ఎ.షర్మిలదేవి, ఎం.రామలక్ష్మి, డి.సంగీత, జి.గౌరీశ్వరికి, చక్కని అవగాహన కల్పించిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ పక్కి లావణ్యకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐడి విశాఖ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.ఎన్.భూపాల్, సిఐడి డిఎస్‌పి ఎల్.నాగేశ్వరి, లక్ష్మణరావు, ఇన్‌స్పెక్టర్లు జి.గోవింద రావు, బివిజి ప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి జి.మురళీధర్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకట నాయుడు, ఎంపిడిఒ జివి రమణ, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.శశిభూషణ రావు, అఖిల భారత ఎస్‌టి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు ఆరిక శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

దేవానంద్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం
గుర్రం జాషువా జాతీయ అవార్డుకు దిగువమండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలక దేవానంద్ ఎంపికయ్యారు. అక్టోబరు 3న హైదరాబాద్‌లో నిర్వహించే గుర్రం జాషువా జాతీయ సాహితీ కళా సేవా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయనకు ఆహ్వానం అందింది. దేవానంద్ ఉపాధ్యాయ వృత్తితోపాటు 30 ఏళ్లుగా నాటికలు, కథలు, బాలసాహిత్య రచనలు రాయడం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. పలు పుస్తకాల్లో రచించిన, ఆలపించిన కవితలు, పాటలు ఎంతగానో గుర్తింపు పొందాయి. దేవానంద్ ప్రతిభను గుర్తించిన పలు సాహితీ సంస్థలు సన్మాన, సత్కారాలతో అభినందించాయి. ఇందులో భాగంగానే గుర్రం జాషువా జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఏజెన్సీ కవులు ఉమామహేశ్వరరావు, పెద్దింటి నిర్మల్ కుమార్, హరిగోపాల్, శేషగిరి, శేఖర్, సూర్యనారాయణ, శైలజ, తదితరులు అభినందనలు తెలియజేస్తున్నారు.

ఒపిఎస్ పునరుద్ధరించాలని నిరసన

ప్రజాశక్తి-వీరఘట్టం
సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం రాత్రి వీరఘట్టంలో ఎంఆర్‌సి వద్ద నిరసన చేపట్టారు. జిపిఎస్ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు కె.గోవిందరావు, వి.శ్రీధర్, వి.అన్నాజీరావు, ఎ.చంద్రమోహన్, ఎస్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ బిల్లు ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి-పార్వతీపురం
ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి ప్రసూన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంటరి ఏనుగు హరి కొమరాడ మండలం నడిమివలస కొండపై ఉందని, రాత్రి సమయంలో కొండదిగువకు వస్తుందని, తెల్లవారు జామున కొండ మీదకు వెళ్తుందని తెలిపారు. రేగులపాడు, పెద్దకేర్జిల, చినకేర్జిల, బుజిగవలస, నడిమివలసమెట్ట, కోటిపాం, జంఝావతి, కుమ్మరిగుంట, ఆర్తామ్ గ్రామస్తులు సాయంత్రం, తెల్లవారు జామున పొలాల్లోకి వెళ్తునప్పుడు, ప్రయాణాలు సాగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ముందస్తు సమాచారాన్ని అటవీ అధికారుల నుండి తీసుకోవాలని సూచించారు. ఏడు ఏనుగుల గుంపు పెదమేరంగి కూడలి వద్ద రామినాయుడువలస గ్రామ సమీపంలో ఉందని పేర్కొన్నారు. ఏనుగులను అటవీ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. కన్నపుదొరవలస, పెద్దవలస, సుభద్రమ్మవలస, సీమనాయుడువలస, భట్లభద్ర, నిమ్మలపాడు, వెంకట్రాజపురం, ఎరుకులపేట, గౌరింపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పంట నష్టంపై అటవీ శాఖ చర్యలు తీసుకుంటుందని, సంబంధిత శాఖలను సమన్వయపరచి నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఆస్తులకు సంబంధించి నష్టపరిహారం అంచనా వివరాలు తహశీల్దార్ నుండి అందిన వెంటనే చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత రేంజ్ అధికారుల నుండి నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. హరి ఏనుగు సమాచారాన్ని - ఉలిపిరి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.సత్యనారాయణ 93984 68628, మిగిలిన ఏనుగుల సమాచారాన్ని బోరి బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.కిరణ్ 9440595181కు ఫోన్ చేసి పొందవచ్చని తెలిపారు.

ఏనుగులను తరలించాలి

గుమ్మలక్ష్మీపురం : ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ఒక ప్రకటనలో కోరారు. కొన్నేళ్ల నుంచి కురుపాం నియోజకవర్గంలో జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం మండలాల్లో ఏనుగుల గుంపు తిరుగుతూ అరటి, మొక్కజొన్న, చెరకు, వరి పంటలను నాశనం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఏ సమయంలో గ్రామాల్లోకి వచ్చి దాడి చేస్తాయోనని ప్రజలు క్షణక్షణం భయపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

ఆక్రమిత స్థలంలో వేసిన నిర్మాణ సామగ్రి

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంటలో జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణ నిర్మాణం చేపడుతున్నారు. అక్రమ నిర్మాణంపై గతంలో రెవెన్యూ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పనులు నిలుపుదల చేశారు. ఆ నిర్మాణం వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ భవన యజమాని మళ్లీ పనులు ప్రారంభించడానికి నిర్మాణ సామగ్రిని సిద్ధం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై తహశీల్దార్ రాజశేఖర్‌ను వివరణ కోరగా అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిని గుర్తించామని, చర్యలు చేపడతామని తెలిపారు.

తుప్పల్లోకి వెళ్లిన బస్సు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం, దండుసూర గ్రామాల సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి తుప్పల్లోకి వెళ్లిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పాలకొండ నుంచి 20 మంది ప్రయాణికులతో ఆర్‌టిసి బస్సు వెళ్తోంది. దండుసూర సమీపంలో మలుపు వద్ద బస్సు అదుపు తప్పడంతో తుప్పల్లోకి దూసుకెళ్లింది. ప్రయాణికులకు ఎవరికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అదుపు తప్పి తుప్పల్లోకి వెళ్లిన ఆర్‌టిసి బస్సు

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అక్టోబర్ 3 నుంచి గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సుధీర్ కుమార్, ఉపాధ్యక్షులు కడ్రక వైకుంఠరావు.. బుధవారం స్థానిక తహశీల్దార్ రాములమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామసభల ఏర్పాటుతో గ్రామ అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని వారన్నారు. గ్రామ అభివృద్ధికి మండల స్థాయి అధికారులు తోడ్పడాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి జగదీశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీహరి, ఉపాధ్యక్షులు దీప ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎల్విన్‌పేటలో ప్రజలకు అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. గృహాలు, వర్తక, వాణిజ్య సముదాయాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి, పాటించాల్సిన పద్ధతులపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా గ్యాస్ వినియోగంపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రదర్శన ద్వారా చూపించారు. మండలంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి నాయుడు, సిబ్బంది మురళి, తిరుపతి ఉన్నారు.

ఆర్యవైశ్య మహిళా సంఘం నూతన కమిటీ సభ్యులు

ఆర్యవైశ్య మహిళా సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ఆర్యవైశ్య సంఘానికి అనుబంధ మహిళా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి సాంబశివ సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. మహిళా సంఘం అధ్యక్షులుగా మాదేటి శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా సుతాపల్లి మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మండా పూజ, సహాయ కార్యదర్శిగా మాదేటి కళ్యాణి, కోశాధికారిగా పేకేటి దీప ఎన్నికయ్యారు. వీరితోపాటు 23 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సాంబశివ, కార్యదర్శి రాపాక నాగసాయి, కోశాధికారి బలభద్రుని శ్రీనివాసరావు అభినందించారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ

ప్రజాశక్తి-సీతానగరం

ఉపాధి హామీ పనుల రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఎపిడి రవీంద్రబాబు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన వాటికి పెండింగ్ బిల్లులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంఎల్‌ఎస్‌ఎన్ ప్రసాద్, ఎపిఒ భాను, ఇసి సిహెచ్ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, శ్రీదేవి, జానకి పాల్గొన్నారు.

29న వైఎస్ఆర్ వాహనమిత్ర ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-పార్వతీపురం

వైఎస్ఆర్ వాహన మిత్ర ఆర్థిక సహాయాన్ని ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి సి మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహన మిత్ర పథకాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి విజయవాడలో ప్రారభిస్తున్నారని తెలిపారు. వాహన మిత్ర పథకం కింద 2023-24వ సంవత్సరానికి సంబంధించి పది వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మరమ్మతులు, ఇతర అవసరాలకు సంబంధించిన ఖర్చుల కోసం స్వీయ-యాజమాన్యమైన ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఎండియులకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. వర్చ్యువల్ విధానంలో నిర్వహిస్తున్న వాహన మిత్ర కార్యక్రమానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్థానికంగా హాజరుకానున్నట్లు వివరించారు.

గరుగుబిల్లి ఆస్పత్రిని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-గరుగుబిల్లి

గరుగుబిల్లి ఆస్పత్రిని డిఎంహెచ్ఒ బగాది జగన్నాథ రావు బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, సామగ్రిని పరిశీలించారు. సిబ్బంది ముఖ ఆధారిత హాజరు తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లను ఆరా తీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించాలని, వృద్ధులను, దీర్ఘకాలిక రోగులను విధిగా పరీక్షలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఏ ఒక్కరిని వదిలిపెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి వద్ద ఏడు రకాల పరీక్షలు నిర్వహించి వారి అనారోగ్యాన్ని గుర్తించి వారికి ఒపి టికెట్ ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. స్థానిక టిడిపి కార్యాలయంలో వినూత్నరీతిలో నోటికి నల్లగుడ్డ కట్టి మౌనదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి, యువ నాయకులు వీరేష్ చంద్రదేవ్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, కురుపాం మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, కన్నా కృష్ణబాబు, వెంకటరావు, రమేష్, మీసాల ప్రశాంత్, సాయి, తాడంగి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం వైసిపి దుర్మార్గపు పాలనకు నిదర్శనమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి దుయ్యబట్టారు. గుమ్మలక్ష్మీపురం గిరిజన వారపు సంతలో బాబుతో నేను కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ పోరాటం చేస్తున్న చంద్రబాబును అక్రమంగా, అన్యాయంగా అరెస్టు చేయడం విచారకరమని ఆమె అన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బాబుతో నేను కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఎల్విన్‌పేటలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, కార్యదర్శి పోలారి శ్రీనివాసరావు, నాయకులు కడ్రక వెంకట్రావు, ఎవ్వరిక బుజ్జీశ్వరరావు, సొంటెనా రాజేష్, తాడంగి రామారావు, కయ్యన్న తదితరులున్నారు.

సాలూరు : మాజీ సిఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బుధవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్ పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : టిడిపి అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టిడిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయంలో వినతి అందించారు.

బలిజిపేట : మండలంలో నారాయణపురంలో టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయచంద్ర మాట్లాడారు. ఆందోళనకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాలూరి బాబు మద్దతిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పెంకి పార్వతి, టిడిపి సీనియర్ నాయకులు పెంకి రామ్మోహనరావు, గొట్టాపు వెంకట్ నాయుడు, మండల ప్రకాశ్, ఎం.అప్పారావు, జి.సింహాచలం, వి.సింహాచలం, కె.సింహాచలం, వి.తిరుపతిరావు, ఎం.సూర్యనారాయణ, ఎన్.రాంబాబు, జి.బాల్లి పాల్గొన్నారు.

వీరఘట్టం : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలోని బాబుకు తోడు మేము సైతం కరపత్రాలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, ఎఎంసి మాజీ ఛైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, పి.వెంకటరమణ, బి.హరిబాబు, ఎ.కుమారస్వామి, కె.అసిరినాయుడు, సిహెచ్ ఉమామహేశ్వరరావు, ఎన్.శశికుమార్, కె.ఉమాశంకర్, జనసేన నాయకులు ఎ.పుండరీకం, జి.నరేంద్ర పాల్గొన్నారు.

గరుగుబిల్లి : గరుగుబిల్లి మండల కేంద్రంలో బాబుతో మేము సంతకాల సేకరణ కార్యక్రమాన్ని టిడిపి మండల కన్వీనర్ అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.పురుషోత్తమ నాయుడు, కార్యదర్శి ఎం.తవిటినాయుడు, టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ఎం.బి.విజయ అంకితం, నాయకులు అంబటి రాంబాబు, కోట సుమన్ భారత్, యర్ర శ్రీనివాసరావు, ఎంపిటిసి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో శిలగాం పంచాయతీలో టిడిపి మహాశక్తి కార్యక్రమంపై, అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆ పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బి.చంద్రరావు, మహాశక్తి ప్రచారకర్త బి.సంధ్యారాణి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

సాలూరులో అర్ధనగ్న ప్రదర్శన చేపడుతున్న టిడిపి శ్రేణులు

నేడు టిడిపి పాదయాత్ర

కురుపాం : కురుపాంలోని టిడిపి కార్యాలయం నుంచి తోటపల్లి దేవస్థానం వరకు గురువారం చేపడుతున్న పాదయాత్ర, సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా అరెస్టు చేశారని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా గురువారం పాదయాత్ర, సైకిల్‌ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు.

పన్ను చెల్లింపులో అశ్రద్ధ వద్దు

మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటరావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఆదాయపు పన్ను చెల్లింపులో ఎటువంటి అశ్రద్ధ చూపవద్దని ఆదాయ పన్ను శాఖ అధికారి జి.రవిశంకర్ అన్నారు. ఆదాయ పన్ను శాఖ టిడిఎస్‌పై అవగాహన సదస్సు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిడిఒలు తమ సిబ్బంది జీతభత్యాలు నుంచి ప్రతినెలా ఆదాయపన్ను మినహాయించాలని సూచించారు. ఆదాయపన్ను చెల్లించడంతో అలసత్వం వహిస్తే అపరాధ రుసుం పడుతుందని స్పష్టం చేశారు. ఆదాయపన్ను చెల్లింపులో అప్రమత్తంగా ఉండాలన్నారు. టిడిఎస్‌లో వివిధ దశలు ఉంటాయని ట్రెజరీ అధికారులకు తెలియజేశారు. ఆదాయపు పన్ను చెల్లింపులో పాన్ తదితర వివరాలు కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. డిడిఒలు ఏ ఉద్యోగికీ మినహాయింపు ఇవ్వరాదన్నారు. నిర్మాణ రంగంలో ఉన్న సంస్థలు కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో విధిగా ఆదాయపు పన్ను చూపించాలని తెలిపారు. డిఆర్ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ టిడిఎస్‌పై అవగాహన లేకపోవడం వల్ల భవిష్యత్తులో డిడిఒలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారని, స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిడిఒలు, జిల్లా కలెక్టర్ కార్యాలయఒ ఎఒ ఆర్.ఉమామహేశ్వరరావు, జిల్లా ఖజానా అధికారి ఎ.మన్మథరావు, ఆదాయపు పన్ను ఇనస్పెక్టర్లు పి.ఉమామహేశ్వరరావు, పి.వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో అదనపు ఆదాయం

పత్తి పంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

అంతర పంటలు, కంచి పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందడమే కాకుండా పంటకు రక్షణ కవచంగా ఉపయోగపడతాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. బహుళ పంటలు ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మండలంలో విశ్వనాథపురం, పాంచాలి, రాయిగుడ్డివలస గ్రామాల్లో అమలవుతున్న అంతర పంటలు, ప్రకృతి సేద్య పద్ధతులను బుధవారం ఆయన పరిశీలించారు వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా అందించిన కంది విత్తనాలు, ఎపిసిఎన్‌ఎఫ్ అందజేసిన కూరగాయల విత్తనాలను పత్తిలో అంతర పంటలుగా, వరి పొలంలో గట్లపై కంచె పంటలుగా వేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల మిత్ర పురుగులను ఆకర్షించి శత్రువులను అరికట్టడమే కాకుండా, అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని తెలిపారు. అనంతరం విశ్వనాథపురంలో తెర్లంగి ధనుంజయ అనే రైతు ప్రయోగాత్మకంగా జంటసాలు పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. పత్తి, వరి పంటలో దోమపోటు నివారణకు ఉపయోగపడే జిగురు అట్టలను ప్రకృతి సేద్య బృందం ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి తిరుపతి నాయుడు, ఐసిఆర్‌పి విజయ్, ఎఇఒ హైమ, విఎఎ మోహన్, రైతులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పార్వతీపురం

నిరంతరం ఉద్యోగుల సేవకే తోట సుధాకర్ ప్రసాద్ జీవితాన్ని అంకితం చేశారని డిఆర్ఒ జె.వెంకటరావు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సుధాకర్ ప్రసాద్ చిత్రపటం వద్ద డిఆర్ఒ, ఎపిఆర్ఎస్ఎ ప్రతినిధులు నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎపిఆర్ఎస్ఎ ప్రతినిధులు జి.శ్రీరామ్మూర్తి, ఆర్.ఉమామహేశ్వర రావు, ఎన్.వి.రమణ, డి.శేఖర్, కె.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపిడిఒ ఎంఎల్ఎస్ఎన్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన వారికి వైద్య శిబిరాలు నిర్వహించి అక్కడ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో కురుస్తున్న మంచు

చంద్రోదయం కాదు.. సూర్యోదయమే

ఈ చిత్రాన్ని చూస్తుంటే చంద్రోదయం అయింది అనుకుంటున్నారా? లేదండి ఇది సూర్యోదయమే!. బుధవారం ఉదయం 8 గంటల వరకు ఏజెన్సీని మంచు దుప్పటి కమ్మేయడంతో హిమపాతంలో సూర్యుడు ఇలా దర్శనమిచ్చాడు. దట్టమైన మంచుతో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ చుట్టూ కొండలు, అడవులు ఉండడంతో ప్రతి ఏటా మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సెప్టెంబర్ నుంచి జనవరి వరకు ఏజెన్సీ అంతటా మంచు కురుస్తుంది.

\- ప్రజాశక్తి, గుమ్మలక్ష్మీపురం

తీర్మాన ప్రతులను దహనం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఎస్‌టి జాబితాలో

బోయ, వాల్మీకులను చేర్చొద్దని నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని, అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన తీర్మానం వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం బెలగాంలో నిరసన చేపట్టారు. తీర్మానం కాపీని దహనం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో నిజమైన గిరిజనులు నష్టపోతారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండల లక్ష్మణరావు, కోలక అవినాష్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండంగి రమణ, కడ్రక రామస్వామి, సీదరపు అప్పారావు, పువ్వల మోహనరావు, పువ్వల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-సాలూరు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులపై లాఠీఛార్జికి వ్యతిరేకంగా బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి నితిన్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. దీని వల్ల వసతిగృహాల్లో విద్యార్థులు జ్వరాలతో మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డైట్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, గౌరీ పాల్గొన్నారు.

పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కృష్ణంనాయుడు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నర్సిపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చెల్లారపు కృష్ణంనాయుడు (68) బుధవారం ఉదయం మరణించారు. వారం క్రితం ఉత్తరాంచల్, నేపాల్ పర్యటన కోసం వెళ్లిన ఆయన బుధవారం నేపాల్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణంనాయుడు మరణంతో నర్సిపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన భౌతికకాయాన్ని తీసుకురావడానికి మూడు రోజులు పడుతుందని టిడిపి మండల అధ్యక్షుడు దొగ్గ మోహన్‌రావు తెలిపారు. కృష్ణంనాయుడు మృతికి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయచంద్ర, నాయకులు జి.వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి శ్రీదేవి సంతాపం వ్యక్తం చేశారు.

కృష్ణంనాయుడు (ఫైల్)

డిటికి వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు లక్ష్మునాయుడు, రమణమూర్తి

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

రేషన్ సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం డిప్యూటీ తహశీల్దార్ చిట్టెమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామవరం పంచాయతీలో ఈ నెల పంచదార అందించలేదన్నారు. మండలంలో 34 పంచాయతీలకు కూడా గత మూణ్నాలుగు నెలల నుంచి కందిపప్పు పూర్తిగా ఇవ్వడం లేదన్నారు. వీటిపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో రామవరం సర్పంచ్ పెంట సత్యనారాయణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు సిహెచ్ కృష్ణ ఉన్నారు.

గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జగనన్న భూ హక్కు -భూ రక్ష పథకంలో భాగంగా అర్హులైన వారందరికీ పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి తెలిపారు. మండలంలోని రేగులపాడు గ్రామంలో రీ సర్వేలో అర్హులుగా ఉన్న 14 మందికి సర్పంచి బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచి తెలిపారు. భవిష్యత్తులో ఎటువంటి భూ తగాదాలకు తావు లేకుండా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చైతన్య స్రవంతి

మున్సిపల్ కార్మికులకు సన్మానం

సాలూరు : స్థానిక మున్సిపాలిటీలో ఉత్తమ మున్సిపల్ కార్మికులు సామాలమ్మ, ఎరుకలమ్మను బుధవారం కమిషనర్ టి.జయరాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజు సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధారపాడులో స్వచ్ఛతే సేవ

సీతంపేట : మండలంలో ధారపాడు పంచాయతీలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని సర్పంచ్ జి.సుందరమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎంపిడిఒ కొండపల్లి సత్యం మాట్లాడుతూ స్వచ్ఛతే సేవా కార్యక్రమం గురించి గిరిజనులకు తెలియజేయాలన్నారు. దీనిలో భాగంగా స్వచ్ఛత మిత్ర సిబ్బందిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి అన్నపూర్ణ పాల్గొన్నారు.